సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 28 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32,300

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32,300, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.35, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.26 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
28.8°/16.8°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రశాంతిగ్రాంలో మద్యం దుకాణం వద్దు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు గ్రామస్తుల వినతి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

పుట్టపర్తి టౌన్: సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, దీన్ని వెంటనే అడ్డుకోవాలని ప్రశాంతి గ్రాం వాసులు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రశాంతిగ్రాంకు చెందిన పలువురు మీడియాతో మాట్లాడారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారని, ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే వారందరికీ ఇబ్బందులు కలుగుతాయన్నారు. అంతేకాకుండా ప్రశాంతి నిలయానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రశాంతి నిలయానికి 10 కి.మీ దూరం వరకూ మద్యం, మాంసం విక్రయాలు జరగకూడదని ట్రస్ట్ వర్గాలు ప్రభుత్వానికి విన్నవించాయని గుర్తు చేశారు. కానీ అధికారి పార్టీ అండదండలతో కొందరు ప్రశాంతిగ్రాంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మద్యం షాపు ఏర్పాటు కాకుండా చూడాలని కోరారు. లేకపోతే తాము రోడ్డెక్కాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కేశవయ్య, రవి నాయక్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సౌకర్యాలున్నా ఫలితాలు ఎందుకిలా?

- విద్యార్థులు ప్రభుత్వ బడులకు ఎందుకు రావడం లేదో ఆలోచించాలి
- విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్



మాట్లాడుతున్న కోన శశిధర్

అనంతపురం ఎడ్యుకేషన్: '40–50 ఏళ్ల నాటి ప్రభుత్వ బడులు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. సౌకర్యాలు కూడా బెస్ట్‌గానే ఉన్నాయి. మరి ఫలితాలు ఎందుకు మెరుగ్గా ఉండటం లేదు' అని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ప్రశ్నించారు. బుధవారం ఆయన సీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఎంఈఓలు, హెచ్ఎంలకు జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలాది రూపాయల ఫీజులు కట్టి రేకుల షెడ్లలో నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపుతున్నారన్నారు. నాయకత్వ లోపాలతోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. అందుకే శిక్షణ తప్పనిసరి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉందన్నారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్నారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం దాదాపు 45 యాప్‌లు ఉన్నాయని, అన్నీ కలిపి ఒకట్రెండ్ చేసేలా చూస్తున్నామని చెప్పారు. 8వ తరగతి పిల్లాడు 3వ తరగతి గణితాలు చేయకపోవడం బాధాకరమన్నారు. రానున్న డీఎస్సీతో టీచర్ల కొరత తీరుతుందని, ఇక కావాల్సిందంతా నాణ్యమైన విద్య అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అకడమిక్ ప్రోగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా పని చేయాలన్నారు. ఒక్క విద్యార్థి ఫెయిల్ అయినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

బంగారు దుకాణాలపై విజి'లెన్స్'

అనంతపురం క్రైం: నగరంలోని బంగారు దుకాణాలపై బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. గాంధీబజార్‌లోని బంగారు దుకాణాల్లో డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సోదాలు చేశారు. తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. తూకాల్లో మిల్లీగ్రాముల మేర తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై తూ.కొ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారు కేసులు నమోదు చేస్తారన్నారు.

రామగిరిలో పచ్చ ప్రతాపం!

- రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన నాయీబ్రాహ్మణుడు రామాంజనేయులు గ్రామంలో 20 ఏళ్లుగా రోడ్డు పక్కన చిన్న బంకు పెట్టుకుని కులవృత్తి చేసుకుంటున్నాడు. ఇటీవల పోలీసులు బంకును ఎత్తివేయాలని రామాంజనేయులుకు తెలిపారు. తన జీవనాధారం పోతుందని ఆయన బతిమిలాడినా పట్టించుకోలేదు.. పైగా 'టీడీపీ వారితో చెప్పించు' అంటూ ఉచిత సలహా ఇచ్చారు.

- కొండాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు తలారి రమేష్, బోయసూరి, మంత్రాల అనిల్‌కుమార్, పూజారి చంద్రమోహన్, జంబో రమేష్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారిని స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు గుప్తనిధులు తవ్వుతున్నారని తమకు సమాచారం వచ్చిందని భయపెట్టారు. రోజూ స్టేషన్ వద్దకు పిలిపిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారు.

- పాపిరెడ్డిపల్లికి చెందిన జయచంద్రారెడ్డి గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం పనిచేశారు. దీంతో కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతలు ఆయన్ను లక్ష్యంగా చేసుకున్నారు. చివరకు ఆయన పొలంలో పనిచేసేందుకు ఎవరూ వెళ్లకూడదంటూ గ్రామస్తులను భయపెట్టారు. దీంతో ఆయన మరో గ్రామం నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు.

...ఇలా రామగిరి మండలంలో టీడీపీ నేతలు చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. రాజకీయ కక్షతో భౌతికదాడులకు దిగుతున్నారు. లేకపోతే పోలీసుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పిస్తూ భయపెడుతున్నారు.



- రాజకీయ కక్షతో సామాన్యులపై జులుం
- గ్రామాల్లో భయాందోళనలు సృష్టిస్తున్న టీడీపీ నేతలు
- వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు
- అక్రమ కేసులు నమోదు చేయాలంటూ పోలీసులపై ఒత్తిళ్లు
- చేయని తప్పులను 'ఒప్పుకోవాలంటూ' పోలీసుల కోటింగ్
- రోజూ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కేసుల బెదిరింపులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ''ఇది రాప్తాడు. ఇక్కడ మేం చెప్పిందే వేదం. మేం చేసిందే చట్టం. మా మాట వినకపోతే మీ జీవితాలు అంతే. కేసులు మోసుకొంటావా... పార్టీలోకి వస్తావా'' అంటూ టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతి పరులపై కక్షసాధింపులకు దిగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిటాల సునీత ప్రాతినిథ్యం వహిస్తున్న రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 'పచ్చ'మంద ప్రతాపం చూపుతుండగా... సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పరిటాల సొంత మండలం రామగిరిలో తమ్ముళ్ల దాష్టీకాలకు అంతేలేకుండా పోయింది. ఇప్పటికే చాలా మంది వైఎస్సార్ సీపీ నేతలు, సానుభూతి పరులు ఊళ్లు విడిచి వెళ్లిపోగా..ఉన్నవాళ్లపై పరిటాల అనుచరులు ప్రతాపం చూపుతున్నారు. భౌతిక దాడులు చేయడంతో పాటు ఆస్తులు ధ్వంసం చేస్తూ రౌడీ రాజ్యాన్ని తలపిస్తున్నారు.

పట్టుకోసం పాకులాట..

పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో తొమ్మిది పంచాయతీలుండగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏడు పంచాయతీల్లో తొమ్మిది ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు జయకేతనం ఎగుర వేశారు. మండలంలో ఎక్కడికి వెళ్లినా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడుతుండటంతో 'పరిటాల' కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టుకోసం పాకులాడుతోంది. ఇప్పటికే పలువురు వైఎస్సార్ సీపీ నేతలను భయపెట్టి పచ్చ కండువాలు వేసింది. ఇంకొందరిపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తోంది.

పోలీసుల ద్వారా వేధింపులు..

తమ మాట వినని వారిపై పరిటాల కుటుంబం పోలీసులను ప్రయోగిస్తోంది. రామగిరి పోలీసులు కూడా విచక్షణ మరచి 'మేడం' ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ సామాన్యులను వేధింపులకు గురి చేస్తున్నారు. గుప్త నిధులు తవ్వుతున్నారని, మట్కా, పేకాట ఆడుతున్నారని, మద్యం, ఇసుక తరలిస్తున్నారని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే ఆలస్యం... కనీస విచారణ కూడా చేపట్టకుండానే వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం సార్ అని ఎవరైనా ప్రశ్నిస్తే తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రోజూ స్టేషన్ చుట్టూ తిప్పుకుంటూ మానసికంగా వేధిస్తున్నారు. 'టీడీపీలో చేరు.. ఐదేళ్లు హాయిగా ఉండొచ్చు' అంటూ బాధితులకు ఉచిత సలహా ఇస్తున్నారు. ప్రజలను కాపాడాల్సిన పోలీసులే టీడీపీకి వంతపాడుతూ దౌర్జన్యాలకు దిగితే తమకు దిక్కెవరంటూ జనం గగ్గోలు పెడుతున్నారు.

మెడికో ఆత్మహత్య

- హాస్టల్‌లో ఉరేసుకుని బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న వీర రోహిత్

అనంతపురం (మెడికల్): అనంతపురం బోధనాస్పత్రిలో జి.వీరరోహిత్ (23) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. వైద్య కళాశాల వర్గాలు, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండకు చెందిన ఉపాధ్యాయ దంపతులు జి.శారద, శివప్రసాద్‌కు వీరరోహిత్ (23), లోకేశ్వరి సంతానం. వీరరోహిత్ 2019 బ్యాచ్ విద్యార్థి. తోటి విద్యార్థులు ప్రస్తుతం హౌస్‌సర్జన్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరరోహిత్ పిన్ని కుమారులు ధీరజ్‌సాయి, విశాల్ ఇదే వైద్య కళాశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు.

ఇంటికి వస్తానని ఫోన్‌చేసి..

వీరరోహిత్ బుధవారం తన తండ్రి శివప్రసాద్‌కు ఫోన్‌చేసి ఇంటికి వస్తానని చెప్పాడు. సరేనన్న తండ్రి తాను అనంతపురం వస్తున్నానని, సాయంత్రం తిరిగి ఫోన్ చేస్తానని చెప్పారు. సాయంత్రం తండ్రి ఫోన్ చేయగా వీరరోహిత్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. దీంతో ఆయన ధీరజ్, విశాల్‌కు ఫోన్‌చేసి వీరరోహిత్ రూమ్‌కు వెళ్లి చూడాలని చెప్పారు. వారిద్దరూ తలుపు తట్టగా.. లోపలి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. తోటి విద్యార్థులు, హౌస్‌సర్జన్లకు సమాచారం ఇవ్వడంతో వారంతా వచ్చి కిటికీలోంచి చూడగా.. వీరరోహిత్ ఫ్యాన్ కొక్కెనికి నైలాన్ తాడుతో ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి అతన్ని సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

అయోమయంగా ఉందని నోట్‌రాసి..

టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ విచారణ చేపట్టగా హాస్టల్‌లో సూసైడ్ నోట్ లభించింది. 'ఐయాం రెస్పాన్సిబుల్ ఫర్ మై డెత్. ఈ ఆలోచనల నుంచి బయటకు రాలేకపోతున్నా. అయోమయంగా ఉండి.. కాన్సన్‌ట్రేషన్ చేయలేకపోతున్నా' అని సూసైడ్ నోట్‌లో వీరరోహిత్ పేర్కొన్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు. ఒత్తిడితోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- విరివిగా రుణాలిచ్చి అండగా నిలవండి
- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు

ప్రశాంతి నిలయం: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశ్రమల శాఖల అధికారులు, బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. పారిశ్రామిక వాడల్లో కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. సింగిల్ డెస్కు పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 10 పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 3,994 దరఖాస్తులు అందగా, అర్హతక కలిగిన 3,883 ప్రతిపాదనలు ఆమోదించామని కలెక్టర్ వివరించారు. పీఎంఈజీపీ కింద పరిశ్రమలు స్థాపించే వారికి రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం రుణ సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ్ రాజు, ఎల్డీఎం రమణకుమార్, డీపీఓ సమత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజేష్, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పేరెంట్స్ మీట్‌ను పండుగలా నిర్వహించాలి

జిల్లాలో డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను పండుగలా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేపట్టాల్సిన ఆరోగ్య పరీక్షలపై ఆరా తీసిన కలెక్టర్... విద్యార్థులకు త్వరితగతిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు జారీ చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహణకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలన్నారు. గురువారం నుంచి విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వకృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్ రామ్, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే నేర నియంత్రణ

- పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి
- నేర సమీక్షలో సిబ్బందికి ఎస్పీ రత్న ఆదేశం
- కేసుల ఛేదింపులో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు



నేర సమీక్షలో పాల్గొన్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ''ప్రజల భాగస్వామ్యంతో నేర నియంత్రణ సాధ్యమవుతుంది. అందువల్ల ప్రతి పోలీసు అధికారి ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి. ముఖ్యంగా విజుబుల్ పోలీసింగ్ పెంచాలి. తద్వారా నేరాలు జరగకుండా చూడవచ్చు'' అని ఎస్పీ రత్న పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న.. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం కేసులు ఛేదింపులో ప్రతిభ కనబరిచిన 26 మంది పోలీసులకు ఆమె ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య, పోక్సో కేసులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే క్రైమ్ రేటు తగ్గించవచ్చన్నారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అందిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విజుబుల్ పోలీసింగ్ పెంచి నేరాలు నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. మట్కా, పేకాట, గంజాయి తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. దీర్ఘకాలిక కేసుల దర్యాప్తు రెండు నెలల్లోపు పూర్తి చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, తరచూ ఫ్యాక్షన్ గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. అలాగే డిసెంబర్‌లో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ కుమార్, వెంకటేశ్వర్లు, కేవీ మహేష్, సీఐలు శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, లీగల్ అడ్వయిజర్ సాయినాథరెడ్డితో పాటు పలువురు ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.



సీఐ నారాయణరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

సహనానికి పరీక్ష



- విద్యార్థులతో జేఎన్‌టీయూ పరీక్షల విభాగం ఆటలు
- నిబంధనలు విస్మరించి ఇష్టారాజ్యంగా విధులు
- గంట ముందు చేరాల్సిన ప్రశ్నపత్రాన్ని ఏకంగా ఒక రోజు ముందే పంపిన వైనం
- విషయం బయటకు రావడంతో అప్పటికప్పుడు మరో ప్రశ్నపత్రం
- జంబ్లింగ్ విధానంలోనూ గందరగోళం
- వర్సిటీ అధికారుల పనితీరుపై సర్వత్రా ఆందోళన



విద్యావ్యవస్థలో పరీక్షల విభాగం అనేది గుండెకాయ లాంటిది. ఆ విభాగం సమర్థత పైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. జేఎన్‌టీయూలో మాత్రం పరీక్షల విభాగం పరిస్థితి అధ్వానంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని పలువురు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో కొన్నాళ్లుగా ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రాలు పంపుతున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే గంట ముందు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం అప్‌లోడ్ చేస్తారు. ఎన్‌క్రిప్టెడ్ పాస్‌వర్డ్ సాయంతో వర్సిటీ దాన్ని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేస్తారు. పేపర్ లీక్‌ను అరికట్టాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఒకటికి బదులు.. మరొకటి..

ప్రస్తుతం వర్సిటీ పరిధిలో బీటెక్ రెండు, మూడు సంవత్సరాలకు సంబంధించి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం పంపే విషయంలో గత శనివారం తీవ్ర తప్పిదం చోటుచేసుకుంది. ఆ రోజు జరగాల్సిన సబ్జెక్టు ప్రశ్నపత్రం పంపకుండా సోమవారం నిర్వహించాల్సిన పరీక్ష ప్రశ్నపత్రం పంపారు. అది కూడా గంట ముందు కాకుండా ఒక రోజు ముందే పంపడం గమనార్హం. డౌన్‌లోడ్ చేసిన ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు దీన్ని చూసి నివ్వెరపోయారు. వెంటనే వర్సిటీ పరీక్షల విభాగం అధికారులకు సమాచారం ఇవ్వడంతో తేరుకున్న వారు హడావుడిగా అప్పటికప్పుడు మరో ప్రశ్నపత్రం పంపారు. దీన్ని బట్టి సదరు విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నాయి.

జంబ్లింగ్‌లోనూ తికమక..

విద్యార్థులకు పరీక్ష కేంద్రాల జంబ్లింగ్ అంశంపైనా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వర్సిటీ పరిధిలో 2013లో జంబ్లింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్ని అనుసరించి ఒక కళాశాల విద్యార్థులను రెండు, మూడు కళాశాలలకు కేటాయిస్తారు. అయితే, ఒకే విద్యార్థికి రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు వేర్వేరు కేంద్రాలను కేటాయిస్తున్నారు. రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు మధ్య కేవలం ఒక గంట సమయం ఉంటుంది. ఈ క్రమంలో రెగ్యులర్ పరీక్ష రాసి, 30 కిలోమీటర్ల దూరంలో ఉండే వేరే కళాశాలకు గంటలో చేరుకుని పరీక్ష ఎలా రాయాలని విద్యార్థులు వాపోతున్నారు. ఇక.. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారులను మార్చి 5 నెలలు అవుతోంది. అయినప్పటికీ పాత వారు సంతకాలు చేసిన జవాబు పత్రాలనే నేటికీ వినియోగిస్తుండటం విశేషం.

అప్పటికప్పుడు కేంద్రం మార్పు..

రాయచోటిలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఇటీవల ఒక కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా, కేటాయించిన కళాశాల పేరు కాకుండా వేరే సెంటర్ పేరును హాల్‌టికెట్‌లో ముద్రించడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. దీనిపై విద్యార్థులు ఆందోళన చెందగా, అప్పటికప్పుడు మరో కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. ప్రశ్నపత్రం పంపడం మొదలు కేంద్రాల కేటాయింపు వరకూ సదరు విభాగం వైఫల్యం చెందుతున్నా వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా సదరు విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నాం

పరీక్షల విభాగానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నాపత్రాలు పంపడంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాం. ఇందులో కొన్ని లోటుపాట్లు జరిగాయి. అప్‌డేట్ అయ్యాక ప్రస్తుతం అంతా సవ్యంగానే పంపుతున్నాం.

– శివకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, జేఎన్‌టీయూ

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల ఢీ - యువకుడి మృతి

పుట్టపర్తి అర్బన్/పెనుకొండ: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన కిష్టప్ప, రామాంజనమ్మ దంపతుల కుమారుడు కుళ్లాయప్ప(28)... గోరంట్ల మండలం బూదిలి సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై విధులకు ప్రయాణమైన ఆయన పుట్టపర్తి మండలం నిడిమామిడి సమీపంలోని శిర్డీ సాయిబాబా ఆలయం మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో కుళ్లాయప్పతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న నిడిమామిడి నివాసి వెంకటాద్రికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక కుళ్లాయప్ప మృతి చెందాడు. వెంకటాద్రి చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి


మృతుడు కదిరప్ప

హిందూపురం అర్బన్: స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కదిరప్ప(70) బుధవారం హిందూపురం జిల్లాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జైలర్ హనుమప్ప తెలిపిన మేరకు... లేపాక్షి మండలం మద్దిపి గ్రామానికి చెందిన కదిరప్ప.. తన ప్రత్యర్థులతో ఘర్షణకు పాల్పడినందుకు ఐపీసీ 426, 452 సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ నెల 8న ఆయనను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు హిందూపురం సబ్ జైలుకు తరలించారు. 16న అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో సబ్ జైలు అధికారులు జిల్లాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం మెరుగు పడటంతో మూడు రోజుల క్రితం తిరిగి సబ్ జైలుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స ప్రారంభించేలోపు ఆయన మృతి చెందాడు.

శ్రీమత్ ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము
కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా
Ph.No. 9491000739
e-Procurement Short Tender Notice
(4th Time Calling)
శ్రీ స్వామి వారి తూర్పు రాజగోపురము రాతి భీమ్ మరమ్మత్తు పనికి e-procurement ద్వారా ఆన్‌లైన్ షార్ట్ ఇ-టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ ను చూడగలరు.
సం/- వి. శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహణాధికారి

● ప్రజల సొమ్ము.. పోతే పోనీ!


తుప్పు పట్టిన పుడా వీసీ కారు


రెండేళ్లుగా ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉంచిన టాటా సుమో



చాలా ఏళ్లుగా మూలన పడేయడంతో తుక్కుగా మారిన తహసీల్దార్ జీపు

ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన వాహనాలు... పోతేపోనీ అనుకున్నారో... ఏమో పలు శాఖలకు చెందిన ప్రభుత్వ వాహనాలు తుప్పు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వాహనాలు కండీషన్‌లో ఉన్నన్ని రోజులూ వాడుకున్నారు. కాసింత మరమ్మతులకు లోనుకాగానే మూలకు పడేసి, అద్దె వాహనాలతో కాలం నెట్టుకొస్తున్నారు. వీటిలో కొన్ని వాహనాలు 5 నుంచి పదేళ్లుగా చెట్ల కిందనే పడి ఉన్నాయి. పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన ఇన్నోవా వాహనం దాదాపు ఏడేళ్ల క్రితం ఎక్కడైతే పెట్టారో అక్కడే కట్టుకదలకుండా ఉండిపోయింది. కార్యాలయాన్ని మార్చినా... ఈ వాహనాన్ని మాత్రం తరలించలేదు. పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయానికి పాత మోడల్ జీపు ఉంది. పూర్తి కండీషన్‌లో ఉన్న ఈ వాహనాన్ని వినియోగించడం ఇష్టం లేని అధికారులు దానిని పక్కన పెట్టేసి టాటా సుమో కొనుగోలు చేశారు. దీంతో జీపు కాస్త ఖండమైంది. అలాగే రెండేళ్లుగా టాటా సుమోను కూడా మూలన పడేశారు. ఒక్కో వాహనాన్ని అప్పట్లో రూ.10 లక్షలకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి కొన్నట్లుగా తెలుస్తోంది.

– పుట్టపర్తి అర్బన్:

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

పావగడ: జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను పావగడ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో పెనుకొండ తాలూకా మావటూరు గ్రామానికి చెందిన హరీష్ అలియాస్ కప్పల్, మేకలపల్లి గ్రామానికి చెందిన మనోహర్ అలియాస్ కబాలి, జానకంపల్లి గ్రామానికి చెందిన సాయి పవన్ అలియాస్ సాయి ఉన్నారు. నిందితుల నుంచి రూ.42 లక్షల విలువ చేసే 31 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను తుమకూరు జిల్లా ఎస్పీ కేవీ అశోక్ బుధవారం వెల్లడించారు. రాజవంతి శివార్లలోని రిలాక్స్ బార్ వద్ద హరీష్ అనే నిందితుడు బైక్‌తో అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా, గుట్టు విప్పాడు. మిగిలిన ఇద్దరితో కలిసి బైక్‌లను చోరీ చేస్తున్నట్లు అంగీకరించాడు. తుమకూరుతో పాటు చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- రూ.8.68 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురం నగరంలోని అనంతసాగర్ కాలనీకి చెందిన షికారి కోటయ్య, షికారి శ్యాలీ అలియాస్ శ్యామ్, షికారి శీన అలియాస్ అర్జున్ ఉన్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు తమ అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడ్డారు. పుట్టపర్తి రూరల్, గోరంట్ల, సోమందేపల్లి, కదిరి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా బుధవారం పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో తాము చేసిన దొంగతనాలను వారు అంగీకరించారు. వీరి నుంచి రూ 7.68 లక్షలు విలువ చేసే బంగారు, వెండి అభరణాలు, రూ. లక్ష నగదు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, జిల్లాతో పాటు అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో పలు చోట్ల దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఎస్ఐలు లింగన్న రామచంద్ర, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించి రివార్డులు అందజేశారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


విద్యార్థిని అప్పగిస్తున్న సీఐ శివరాముడు

ముదిగుబ్బ: చదువుకోవడం ఇష్టం లేక స్కూలు నుంచి పారిపోయిన విద్యార్థి చరణ్ నాయక్ ఆచూకీని పోలీసులు గుర్తించి బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం నేలకోట గ్రామానికి చెందిన విద్యార్థి చరణ్‌నాయక్ అదే పట్టణంలోని బీఎస్ఆర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. చదువు ఇష్టం లేని సదరు విద్యార్థి స్కూలుకు వెళుతున్నట్లు ఇంట్లో తెలిపి ఎక్కడికైనా వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతో బుధవారం ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఒంటరిగా తచ్చాడుతున్న విద్యార్థిని పోలీసులు గుర్తించి ఆరా తీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో బాలుడి తల్లిని ముదిగుబ్బ పీఎస్‌కు రప్పించుకుని కౌన్సిలింగ్ అనంతరం చరణ్‌నాయక్‌ను అప్పగించారు.

బీసీసీఐ టోర్నీలో రాణించిన చక్రిక


దండు చక్రిక

అనంతపురం: ఒడిశాలోని కటక్ వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి బాలికల అండర్–15 క్రికెట్ టోర్నీలో అనంతపురం జిల్లాకు చెందిన క్రికెటర్ దండు చక్రిక మరోసారి సత్తా చాటింది. వన్డే సిరీస్ నాల్గో మ్యాచ్‌లో ఏపీ, హిమాచల్‌ప్రదేశ్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ జట్టు బ్యాటర్లు చక్రిక బౌలింగ్ ధాటికి ఒక్కొక్కరుగా పెవిలియన్ దారి పట్టారు. మొత్తం 7 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి మూడు వికెట్లను చక్రిక తీసుకుంది. దీంతో 90 పరుగులకు హిమాచల్ ప్రదేశ్ జట్టు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఏపీ జట్టు 16.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 91 పరుగులతో ఘన విజయం సాధించింది. జట్టులో రాణించిన చక్రికను జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జ్ కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

'మామిడి'లో యాజమాన్యం పాటించండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్

ధర్మవరం రూరల్: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని రైతులకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామంలో రైతుల మామిడి తోటలను బుధవారం డివిజన్ ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరితో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడిలో పూమొగ్గ రావడానికి 0.52.34 మూడు గ్రాములు, సూపర్ కాన్ఫిడర్ 0.5 ఎంఎల్, ఆగ్రోమిన్ మాక్స్ 3 గ్రాములు, బావిస్టన్ 1 గ్రాము చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. డిసెంబర్ 10వ తేదీలోపు వర్షాలు పడకపోతే తప్పక నీరు పెట్టాలన్నారు. ఆ సమయంలో లిక్విడ్ సల్ఫర్ నాలుగు లీటర్లు చొప్పున ఎకరానికి డ్రిప్ ద్వారా అందజేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు గీతాంజలి, చరిత, ఎంపీఈఓ రాజేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా పథకాలపై అవగాహన కల్పించండి

- కర్నూలు రీజనల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్


రికార్డులు పరిశీలిస్తున్న నాగానాయక్

బత్తలపల్లి: తపాలా శాఖలో అమలవుతున్న పథకాలు, సేవలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలంటూ సిబ్బందిని కర్నూలు రీజనల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్ ఆదేశించారు. బుధవారం బత్తలపల్లిలోని పోస్టాఫీసును ఆయన తనిఖీ చేశారు. పోస్టాఫీసు ఖాతాదారులను, ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... ఐపీపీబీ ఖాతాలు తెరవడంపై అవగాహన కల్పించారు. ఆధార్ సీడింగ్ కాని వారు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్లు, పీపీఎఫ్ ఖాతాలు, ఇతర పొదుపు, బీమా పథకాలను వివరించారు. కార్యక్రమంలో బత్తలపల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ కమ్మన్న, మాల్యవంతం ప్రకాష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకిద్దాం

- ఐసీడీఎస్ పీడీ సుధావరలక్ష్మి



మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్, చిత్రంలో ఐసీడీఎస్ పీడీ సుధావరలక్ష్మి, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: కేంద్రం అమలు చేస్తున్న 'బాల వివాహ–ముక్త్ భారత్'కు అనుసంధానంగా జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధా వరలక్ష్మి తెలిపారు. బుధవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ, బాలలకు బంగారు భవిష్యత్ ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకోసం బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లలోపు వివాహం చేయడం నేరమన్నారు. వారి తల్లిదండ్రులకు చట్ట ప్రకారం శిక్షలు పడతాయన్నారు. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల వారి భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. అందువల్ల అందరూ తమ పిల్లలను బాగా చదివించాలని, ఎదిగే పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. సమత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రభుత్వంతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బాల్య వివాహ రహిత దేశం కోసం పాటుపడదామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు కేంద్ర మంత్రులు అనిల్ మాలిక్, అన్నపూర్ణాదేవి, సావిత్రి ఠాకూర్ ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం లలిత, ప్రిన్సిపాల్ గురునాథ్, అడ్వకేట్లు జయభారతి, సతీష్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

13 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం అర్బన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొల్లకుంట గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫారూక్, సిబ్బంది బుధవారం తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ అధికారులను రాకపై సమాచారం అందుకున్న మద్యం విక్రేతలు నరసింహమూర్తి, ఆయన కుటుంబసభ్యులు మంజునాథ్, జయమ్మ ఇంటికి తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో కొట్నూరు సచివాలయ అధికారులు డి.నరేష్, రవితేజ సమక్షంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన ఎక్సైజ్ అధికారులు... మొత్తం 13 బాక్సుల్లోని 1,248 టెట్రా ప్యాకెట్లు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.80 వేలుగా అంచనా వేశారు. కాగా, మంజునాథ్‌పై హిందూపురం ఎక్సైజ్ కార్యాలయంలో 4 కేసులు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో ఒక్కో కేసు నమోదైనట్లుగా సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో రేపు జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మణప్పురం ఫైనాన్స్, డైకిన్ ఏసీ తదితర సంస్థల అవసరాలకు సరిపడే మానవవనరులను ఎంపిక చేయనున్నారు. పదోతరగతి, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 7995482414లో సంప్రదించవచ్చు.

డిసెంబర్ 29న జిల్లా స్థాయి డీఎస్సీ ఎస్జీటీ మాక్ టెస్ట్

పుట్టపర్తి టౌన్: డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లా ఎస్జీటీ అభ్యర్థులకు కొత్తచెరువులోని వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 29న సన్నాహక (మాక్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తచెరువు కేంద్రంగా జరిగే ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 30వ తేదీలోపు www.vadaanya.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు సంస్థ ద్వారా ఎంపికైన వారికి స్కాలర్‌షిప్‌నూ అందించనున్నారు.

భార్య గొంతు కోసి.. హతమార్చి

- పరారీలో భర్త


హతురాలు ఈశ్వరమ్మ

హిందూపురం అర్బన్: లేపాక్షి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. అనుమానంతో కట్టుకున్న భార్యనే హతమార్చి ఓ వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మండల కేంద్రం లేపాక్షికి చెందిన రాజశేఖర్ కొన్నేళ్ల క్రితం అదే మండలం కొండూరు ఎస్సీ కాలనీకి చెందిన తన మేనకోడలు ఈశ్వరమ్మ (32)ను రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లి తర్వాత కొండూరులోనే మకాం పెట్టాడు. వీరికి 9, 7వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న రాజశేఖర్ తరచూ ఆమెను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. బంధువులు, చుట్టుపక్కల వారు నచ్చజెప్పినా వినకుండా భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవ పడిన రాజశేఖర్ బుధవారం వేకువజామున కత్తితో ఆమె గొంతు కోసం హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న లేపాక్షి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం


రిజ్వాన్‌బాషా (ఫైల్)

పరిగి: మండలంలోని శాసనకోటలో రిజ్వాన్ బాషా (41) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... బేల్దారి పనులతో జీవనం సాగించే రిజ్వాన్‌బాషాకు భార్య ఫక్రూన్నీసా, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేశారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన రిజ్వాన్‌బాషా పనికి వెళ్లకుండా జులాయిగా మారాడు. ఈ క్రమంలో తన జల్సాలు తీర్చుకునేందుకు డబ్బు కోసం భార్యను వేధించేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం తాగేందుకు డబ్బు కావాలంటూ భార్యతో గొడవపడ్డాడు. తన వద్ద డబ్బు లేదని ఆమె తెలపడంతో క్షణికావేశానికి లోనైన ఆయన అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఫక్రూన్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫోన్‌పే ద్వారా నగదు అపహరణ.. యువకుడికి దేహశుద్ధి


నిందితున్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గుత్తి: ఇతరుల ఫోన్‌పే ఖాతా నుంచి తన ఖాతాకు గుట్టు చప్పుడు కాకుండా రూ.వేలు బదలాయించుకున్న యువకుడిని స్థానికులు గుర్తించి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. వివరాలు... నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రాజు బుధవారం గుత్తిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తున్న తన బావమరిదిని పలకరించేందుకు వెళ్లిన రాజు... అక్కడ బావమరిది వద్ద ఎర్రగుడికి చెందిన శేఖర్ సెల్‌ఫోన్‌ను గమనించి చూసిస్తానంటూ ఇప్పించుకున్నాడు. అనంతరం బావమరిదిని మాటల్లో పెట్టి తెలుసుకున్న ఫోన్‌పే పిన్ నంబర్ తెలుసుకుని గుట్టుచప్పుడు కాకుండా తన ఫోన్‌పే నంబర్‌కు రూ.30 వేలు బదలాయించాడు. విషయాన్ని గమనించిన బావమరిది, బాధితుడు శేఖర్‌తో పాటు స్థానికులు రాజుకు దేహశుద్ధి చేసి, కాళ్లుచేతులు కట్టి పడేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు అక్కడకు చేరుకుని రాజును విడిపించి పీఎస్‌కు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc. (నర్సింగ్) అడ్మిషన్స్
AP EAPCET తో సంబంధం లేకుండా B.Sc. (నర్సింగ్) కి Management సీట్స్ కలవు. అర్హత : ఇంటర్ Bi.P.C లేదా ఒకేషనల్ with బ్రిడ్జి కోర్స్ పాస్. సంప్ర: జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1417]

అడ్మిషన్స్
Online జరుగుచున్నది. B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) కి గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్. అర్హత : ఇంటర్ లో Bi.P.C. పాస్ (లేదా) ఒకేషనల్ గ్రూప్‌తో పాటు బ్రిడ్జి కోర్స్ పాస్. సంప్ర : జి. మురళి, 9030661651, అనంతపురము. [A-1419]

REAL ESTATE

SHOPS FOR RENT
ATP, టవర్ క్లాక్ సమీపంలో, షాప్స్ ఫర్నిచర్‌తో సహా రెంట్ / లీజుకు కలదు. లేడీస్ కార్నర్, ఫ్యాన్సీ స్టోర్స్, 1 గ్రామ్ గోల్డ్, రెడీమేడ్ షాప్స్ కి అనువైనవి. సెల్: 8688679348. [A-1418]

SERVICES

CHANGE OF NAME
I, (Patan) P. NURUNNISABEGUM (Old Name), R/o 28-6-391-4, NEAR MASJID, HOUSING BOARD COLONY, ANANTAPUR (T&D), A.P. I changed my Surname after marriage, from (Patan) P. NURUNNISABEGUM to MAKKA NOORUNNISA BEGAM, Henceforth my Surname & Name known as MAKKA NOORUNNISA BEGAM W/o MAKKA SHAMSHUDDIN for all purpose. [A-1421]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
అనంతపురములోని ప్రైవేటు జూనియర్ కాలేజ్ నందు పనిచేయుటకు P.G. పూర్తి అయిన Gent Tutors (కుక్, మెస్ వర్కర్స్, స్వీపర్స్) కావలెను. సంప్ర : 9866117303, 9908829351. [A-7085]
త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]
ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము, భోజనము సదుపాయం, వర్క్ ఫ్రంహోం అవకాశముంది. సం:91102 56233, 8073902428 [G-9078]
ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:8121818692 [G-9087]
బ్యాంకులలో జాబ్స్ కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్, రికవరీ. జీ: 25000/-. © 9491685700 [G-9625]
సెక్యూరిటీ గార్డ్స్, జీ:11,000,ఆఫీస్‌బాయ్(ప్యాకింగ్‌హెల్పర్స్, వెయిట్‌లిఫ్టింగ్) 4WO, ఫీల్డ్‌ఆఫీసర్స్,జీ: 10,000, PF,ESI, కళ్యాణదుర్గం,ధర్మవరం,ATP,హిందూపూర్‌లోకావలెను. 9676392502, 9989929852. [T-1235160]
GOLDEN OPPORTUNITY: మీ స్వంత సేల్స్ టీమ్‌ని నియమించుకొని, బిజినెస్ అభివృద్ధి చేసుకోండి మరియు ఆకర్షణీయమైన జీతంతో పాటు, పెట్టుబడి లేకుండా వ్యాపారవేత్తగా మారే అవకాశం కలదు. వెంటనే సంప్రదించండి సెల్: 7306812727. [A-1420]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నీచర్స్, ఆటోమొబైల్, కంప్యూటర్స్, సర్వీసెస్, వివాహాలు
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185